

# నా సంసారం

పురాణం సూర్యప్రకాశరావు

"నేను కాఫీ తాగను"

నా సమాధానానికి చిరంజీవి ఆశ్చర్యం ప్రకటిస్తూ "అంటే ఇంట్లో కూడా తాగరా?" అన్నాడు పేముకుర్చీ ముందుకు లాక్కుని కూచుంటూను. ఆతర్వాత అయనే "ఇప్పుడు నేను ఈ ప్రశ్న చాలా ఆశ్చర్యంగా అడిగానుకదూ? కాఫీ తాగకపోవట మన్నది ఒక ఆశ్చర్యకరమైన విషయం అయిపోయింది. అరుదయిన సంగతి ఆశ్చర్యకరమైంది కదూ?" అంటూ నవ్వుకున్నారు.

నేను నా వీపువైపు చూపిస్తూ "నా వీపు మీద ఒకపెద్ద మచ్చవుంది. ఒకప్పటి నా కాఫీ వ్యసనానికి అదొక నిదర్శనం. నా తమ్ముడిది చిత్రం! నాకు సరిపడా నేను తాగిందే ఒక్క చుక్కయినా అవతలవాళ్ళు ముట్టుకుందుకు వీలేదు. ఇదంతా చిన్నప్పటి విషయంలెండి. ఆనాడే వాడూ పూర్ణించి కొత్తిగాదిగాడు. వుదయం నాపద్ధతి చూశాడు. నేను తాగే వరకూ వాడు తాగటానికి వీల్లేదనే వరకుకు వాడు లొంగకుండా ఎదురుతిరిగి అంతకు ముందే కుంపట్లో నాకు తెలియకుండా కాచేసిన చెంబుతో నా వీపుమీద ఈ బహుమానం ప్రసాదించాడు. ఆ వుండు మానటానికి మాసంవత్సర పట్టింది. అప్పట్నించి నేను కాఫీతాగటం మానేశాను." అన్నాను ఆనాటి సంఘటనకు ఒక ఔన్నత్యం ఆపాదించే ధోరణిలో అఖరిమాటలు కొత్తి పలుకుతూను.

"అయితే నా కరత్నం గరిటకాలేయ్! మర్యాకటే నేనొకటి పుచ్చుకుందాం" అన్నాడు చిరంజీవి భలోక్తిగా భార్యవైపు తిరిగి.

ఆవిడ నవ్వుకుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

"ప్రకాశరావుగారు చెబుతున్నారుగా. నెలకు ఇరవై రూపాయలు కలిసొచ్చేటప్పుడు వెధవది రెండు నాలుకలతో రణాళ్ళు బాధపడలేమా?— ఉక్కగావుంది బయటకూర్చుందాం."

కుర్చీలు ఆరుబయట వేసుకుని కూర్చున్నాం. మెట్టతామరపువ్వులు బరువుగా కదులుతున్నాయి. చిరంజీవి లేచి రేడియో కట్టేసి వస్తూ "మీరు వున్నట్టుండి మాట్లాడటం మానేస్తారు. మొదలు పెడితే ఒకంతట ఆగరు. మంచి కబుర్లేమయినా చెప్పండి" అన్నాడు.

కుర్చీ కూర్చుందుకు అనుకూలంగా లేదు. లేచి సర్దుకున్నాను చీకటి పడుతోంది కాబిరీలాంచి మామీద పడుతున్న వెలుతురు ఆ విషయం స్పష్టం చేస్తూంది.

నేను వున్నట్టుండి తెలుగు సంసారాలు, అనే విషయం ఎత్తుకున్నాను, అయితే, ఇది సందర్భశుద్ధిలేని ఎత్తుగడకాదు. ఇందాక సగంలో వదిలేసిన కాఫీ ప్రసక్తి ఈచర్చలో ఒక భాగం.

చిరంజీవి సిగరెటు ముట్టించాడు. పొగ చిన్న మేఘంలా మా ఇద్దరి మధ్యా వచ్చి నిలిచింది. చిరంజీవి శ్రద్ధగా వినసాగాడు. అతనిశ్రద్ధ నన్ను మరింత ఉత్సాహపరిచింది.

నూటికి కోటికీ ఒకటిరెండు సంసారాలు మినహాయిస్తే మన మధ్యతరగతి తెలుగు సంసారాలన్ని ఇంచుమించు ఒకటే విధమైన దుబారాకి అలవాటుపడిపోయాయి. సంసారంలో మెంబర్ల సంఖ్య ఎక్కువను కొండి; ఈ దుబారా ప్రమాణం కూడా హెచ్చుగా వుంటుంది. సంసారం చిన్నదయితే తక్కువ స్థాయిలో ఈ దుబారా జరుగుతుంటుంది. ఎంతతక్కువగా అంచనా వెయ్యండి ఈ దుబారా ప్రతి సంసారంలోనూ పాతిక రూపాయిలకి తక్కువగా వుండదు కొద్ది ఆత్మపరిశీలన వుండి ముందు దృష్టి వున్నట్టయితే ఈదుబారా తగ్గించుకోవటం ఏమంతకష్టమయిన విషయం కాదు. అసలు జీతంగా ఆర్జన స్వల్పమయిన వాళ్ళు కూడా ఈవిధమైన దుబారాకి అలవాటు పడటం మరి ఆశ్చర్యంగా వుంటుంది.

"వాటికి కారణాలు నేను చెప్పనా, సంసారాల్లో వ్యక్తులకి వేళ్ళు తన్నుకుపోయిన కొన్ని మూఢ నమ్మకాలు, కొన్ని దురలవాట్లు, ఈవిధమైన దుబారాకి మూల కారణాలు అని నేననుకుంటాను" అన్నాడు చిరంజీవి.

"మీరు చెప్పింది అక్షరాలానిజం. కొన్ని కొన్ని సంసారాల్లో వయస్సు మళ్ళిన పెద్దవాళ్ళు చిన్నవాళ్ళని ఇలాంటి మూఢ నమ్మకాలతో తప్పుదోవ పట్టిస్తూంటారు. తరుచుగా దేవుని పేరటో దేవతపేరటో భారీ ఎత్తున పూజాపునస్కారాలు జరుగుతూంటాయి. అన్నకొంతి జరగాలంటూ అయిన వాళ్ళనీ కాని వాళ్ళనీ పూరూనాడు ఏకంచేసి గుండిగలు వారుస్తారు. ఒక్కొక్కప్పుడు ఈ విధమైన ఖర్చులు వందలు దాటుతుంటాయంటే నమ్మండి. సంసారం అన్నతర్వాత, పదిమంది ఇంట్లో వున్నప్పుడు, పురుళ్లొస్తాయి పుట్టింరోజులు వస్తాయి. నామకరణాలు, నూతిలో చేద వెయ్యటం గడపదాటటం బోర్లపట్టం వుయ్యాల్లో పడుకో బెట్టటం, అన్నప్రాసనలూ, పుట్టింరోజులూ, అక్షరాభ్యాసాలు - ఇత్యాది ముచ్చట్లన్నీ తెలుగు సంసారాల్లో సాధారణంగా భారీ ఎత్తునే జరుగుతూంటాయి. ఇవన్నీ యథావిధిగా జరపకపోవటం పిల్లలకు ఏదో లోటుచేసినట్లుగా భావిస్తుంటారు మనవాళ్లు. ఇవన్నీ విపరీతమైన ఖర్చుతో కూడుకొన్నవి. ఇలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలకి కూడా ఇలాంటి అభిప్రాయాలే నాటుకు

పోతాయి. ఇదంతా దగ్గర డబ్బువుండి కాదు సుమండీ, అన్నీ అరువులు. మన తెలుగు సంసారాలు చాలావరకూ అరువుల మీద బ్రతుకుతున్నవే. బట్టలకొట్టు కాతా, పచారీకొట్టు కాతా, పాలూ, పెరుగూ, నెయ్యి ఇవన్నీ కాతాలు. అనా వస్తువు కేరిక అమ్మే ఈకొట్టువాళ్ళంతా నెలల తరబడి బాకీలు వసూలు కాకపోయినా కాతాలు వదులుకోరంటే అలా వాళ్లు ఎందుకు నిదానిస్తున్నారనే యోచన మన వాళ్ళకుండదు. ఈ అరువులు పాపం పెరిగినట్టు పెరిగిపోవటం, చివరికి లొంగుబాటు తప్పి నగానట్రా అమ్మటమో, తాకట్టు పెట్టో అప్పులు తీర్చటం మన కుటుంబాల్లో సర్వసాధారణంగా జరిగే విషయమే."— కాస్త విశ్రాంతిగా ఆగాను.

చిరంజీవి లోతైన విషయాలపట్ల చూపే శ్రద్ధ నాకు తెలుసు. "ఒక సంసారాన్ని తీసుకుని చక్కని నవల రాయండి. బాగుంటుంది" అన్నారాయన.

చూరు కింద కుట్ట తామరపువ్వు అందం నలుపులో కలిసిపోయింది.


"అలాంటి సంకల్పం నాకు లేకపోలేదు. అయితే నా అభిప్రాయాలు పదిమంది చెవిని వేసి వాళ్ళ అభిప్రాయాలు తెలుసుకునిగాని అలాంటి ప్రయత్నం చెయ్యదలచుకోలేదు." అన్నాను.

"అక్కర్లేదు. మీరు రాయండి"

"ప్రయత్నిస్తాను"

"మీరు సగంలో ఆపినట్టున్నారు?"

నేను క్షణం మౌనం తర్వాత "ఈ దుబారాలు ఇంకా అనేకవిధాలజరుగుతూంటాయి. పైకి చాలా స్వల్పమయినవిగా కనిపిస్తాయి. కాని అవన్నీ కూడితే సంసారాన్ని నిలువునా ముంచేటంత శక్తివంతమై వుంటాయి. ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. మా తమ్ముడున్నాడా! వాడికి బజారుకుపోయి సరుకులు తీసుకురావటం నామోషీ! కూరలు బేరం ఆడి మంచివి ఏరుకు రావటం నామోషీ! అవి ఇంటికి తెచ్చుకోవటం నామోషి!— వాడికి అన్నీ నామోషీలు. ఒక అణా ఇచ్చి మనిషిని మాట్లాడుకుంటాడు అవి మోసుకురావటానికి. బట్టలు నలగకుండా రెండు రోజుల కొకసారి మారుస్తూంటాడు. బజారుల్లో కనబడే కొత్త ఫాషన్లన్నీ ముందుగా మావాడు అనుకరిస్తాడు. ఎలా లేదన్నా నెలకోక చొక్కాగుడ్డో, లాగూగుడ్డో కొనందే వాడికి తృప్తిగా వుండదు. ఇక స్నో, ఫేస్ పౌడరు, రోజుకు పదిమార్లు సబ్బు రుద్దటం, ఖరీదైన సబ్బులుగాని వాడకపోవటం, మూడు మూణ్ణాళ్ళకి అవి అయిపోవటం, మళ్ళీ తెచ్చుకుంటూ వుండటం— ఇత్యాది వ్యామోహాలు విపరీతం. వాడు చూడని సినిమా లేదు. వారానికి రెండు సినిమాలు చూస్తాడు. కూచుని తింటే కొండంతైనా కరిగిపోతుంది. ఏదో పిత్రార్జితం స్వల్పంగా వుందనుకోండి. ఈ పద్ధతిని అది ఎన్నాళ్ళు నిలుస్తుంది. అదేమని నేనంటే వాడు రాద్ధాంతం చేస్తాడు. "పోనిద్దూ! కుర్రతనం" అని అమ్మ వాడ్ని వెనకవేసుకొస్తుంది. వాడు ఏపని చేసినా ఒద్దికగా, లాభదాయకంగా వుండి తీరుతుందని గట్టిగా చెప్పటానికి లేదు. ఎందుకంటే అందులో శ్రద్ధా, బాధ్యతా, అనే రెండు విలువైన



# ★ నా సంసారం ★

వస్తువులు లుప్తమయి వుంటాయి. కాబట్టి ఈ తరం కుర్రకారు వాళ్ళంతా ఇలాంటి పద్ధతులు బాగా అలవాటు చేసుకుంటున్నారు. మా తమ్ముడికి తెలిసినన్ని అత్తరూ, సెంటు-ఇత్యాది అలంకార ద్రవ్యాలపేర్లు చాలా తక్కువమందికి తెలుస్తాయి. అది వాడికి గర్వకారణం. ఇలా చూస్తూ, చూస్తూ అగాధంలోకి దిగబడి పోతూంటే ఏమీ చెయ్యలేక బెంగగా వుండి తిక్కగా అటూ అటూ పోతూంటాను. ఎలాగైనా ఈ మారు గట్టిగా పట్టుపట్టి మా యింటి పద్ధతులు మార్చాలి చిరంజీవిగారూ."

"ఒక్క మీ సంసారం ఏమిటి. ఇంచుమించు మధ్యతరగతి తెలుగు సంసారాలన్నీ ఇలాగే వున్నాయి. పెద్దవాళ్ళ మాటకి మనం ఎదురు చెప్పలేం. వాళ్ళు మన్ని కుర్రవాళ్ళ కింద తోసిపారేస్తారు. గట్టిగా, కఠినంగా సంచరించాలనుకుంటే కుటుంబంలో కలతలు. అలాంటి కలతల్నయినా సహిస్తారుగాని మనవాళ్ళు పొదుపుని మటుకు అలవర్చుకోలేరు." అన్నారు చిరంజీవి.

"ఏమైనా పాటలు రాశారా?"

కృష్ణమూర్తిగారూ, ఆయనా కలిసిరాసిన 'సగం తెగిన కొండ' పాటపాడి వినిపించారు నాకోరిక పైన.

"చాలా బాగుందండీ"-చిరంజీవి కుటీరం మనశ్శాంతికి అనువైనచోటు. చుట్టూ పైరు భూములు, అక్కడా అక్కడా చిన్నచిన్న కుటీరాలు, ఎదురుగా సగం విరిగి, సిగ్గుపడి ముఖం వెనక్కి తిప్పుకున్న పర్వతరాజం. అనువయిస్తూ కొండ కోనని చల్లగా స్పృశిస్తూ సాగిపోయే మేఘపంక్తి—ఇత్యాది పరిసరాలమధ్య ఒక సెలయేరులాంటి రచయిత, అతని కవనం, అభిమానంకొద్దీ వచ్చిపోయే అతిథులూ, వారి కాయింట లభించే ఆదరణ,—ఆ చూరు నీడన ఎర్రటి పెట్టతామర పువ్వుల కెదురుగా కూర్చుని ఆ పాటలు వింటూ, కొన్ని రోజులకి ఒకరోజు, బాధ్యత తెలియని మనుష్యులమధ్య మింగలేని బెంగని, బాధని, నిస్పృహని వదిలించుకుందుకు అక్కడికి వెళ్తూంటాను. మనసు విప్పుతాను, మనసు కలుపుతాను, మనసు నింపుకుని ఉత్సాహంగా వచ్చేస్తూంటాను.

చేతి గడియారం చూసుకున్నాను. ఏడు గంటలయింది. 'నేను వస్తాను' అంటూ లేచాను.

చిరంజీవి వీధి మొగవరకూ సాగనంపాడు.

* * *

నేను ఇంటికి చేరేవేళకి ఎనిమిదయింది. భోజనంచేస్తూ అన్నాను. "నేనొక మాట చెబుతాను వింటారా?" అని. ఇలా అనటానికి ఒక కారణం లేకపోలేదు. ఇందాక వస్తూంటే చల్లగాలికి ఆరుబయట కూర్చున్న సాహుకారు "ఏమండీ పంతులుగారూ" అంటూ నవ్విన నవ్వు నన్ను ఇంకా వెన్నాడుతూనేవుంది. ఒక పచ్చనోటయినా అతగాడి పుస్తకంలో చెల్లు వేస్తేగాని పరువు దక్కేట్టులేదు. ఆ వేడిలో అన్నం పెడుతూ అమ్మ నసుగుతుంది—"ఎల్లుండి చెల్లాయి పుట్టినరోజురా. కాస్త వున్నదాంట్లో వున్నంతగా అయినవాళ్ళని నలుగుర్ని పిలుచుకుని ముచ్చట చేసుకుందామని"-అంటూ గొణుగుడు ప్రారంభించింది.

నాకు రిమ్మెత్తిపోయింది. అయినా తమాయించుకున్నాను. అప్పుడన్నాను పై మాటలు. అమ్మా, అనురాధా నావైపు సాభిప్రాయంగా చూడసాగారు. "నిన్నగాక మొన్న పిల్లవాడి బారసాలంటూ రెండొందలు ఖర్చు చేయించారు. మళ్ళీ ఎల్లుండి పుట్టినరోజంటున్నారు. నేను మీకు అనేకవిధాల ఇదివరకు చెప్పిచూశాను. అయినా మీరు బాధల్నీ, కష్టాలనీ ఇలా పోగు చేసుకుంటూనే వున్నారు. మీలో ఎలాంటి మార్పు నాకు కనిపించటంలేదు. ఏమి చెయ్యాలో పాలుపోవటంలేదు. ఇదిగో ఈ ఉంగరం ఒక్కటే నా దగ్గర మిగిలివుంది. ఇది అమ్ముకుని నీకు ఎలా చేసుకుంటే తృప్తిగా వుంటుందో అలాగే చేసుకో" అన్నాను చేతి వుంగరం అమ్మ ముందుకు నెట్టుతూను.

అమ్మముఖం పాలిపోయింది. అనూరాధ నావైపు బాధగా చూసింది. ఒక్కక్షణంలో నే నూహించినమార్పు అమ్మ ముఖంలో నాకు కనిపించింది. ఆమె నేలమీద చతికిలబడి "అవున్నాయనా. నాబుద్ధి గడ్డితింది. మానేస్తానులే" అంది. అయితే కేవలం ఇది నాకు అనుకూలమైన పరివర్తన అనుకుందుకు వీలేకుండా అందులో కొంత నిష్ఠూరం జోడించింది. అది నాకు మరీ బాధాకరంగా పరిణమించింది. అయినా నేను దిగజారకుండా "మంచిది అలాగే చెయ్యి" అన్నాను.

ఆ తర్వాత నా భోజనం ముగిసేవరకూ అమ్మ నాతో ముభావంగానే మసులుకుంది. ఏమైనా నాకు కావల్సింది మార్పు.

అమ్మ ముభావం వహించినా నేను మటుకు ఈ అవకాశాన్ని వదులుకోకుండా




చాలా విషయాలు చెప్పాను. అందులో ముఖ్యంగా ఇలాంటి ముచ్చటగురించీ, కాఫీ గురించి ఎక్కువగా చెప్పాను. "ఈ కాఫీ ఒక దురలవాటు. పెద్ద గుబారా! ఇది మానుకుంటే ఆడబ్బు మరోక విధంగా మనం సద్వినియోగం చేసుకోవచ్చు. ఉదాహరణకి ఎక్కడయినా ఒక మూడొందలు అప్పుగా తీసుకుంటే అది వాయిదాల పదతిని నెలకి పాతికో ముప్ఫయ్యో ఆ అప్పుకింద కట్టుకుంటే ఆ మొత్తం పెట్టి అనూరాధ గొలుసు తాకట్టునించి విడిపిద్దాం. లేకపోతే ఆడబ్బు పచారీకొట్టులో కట్టేద్దాం. ఇంకా బట్టల కొట్టులో పెద్ద బాకీవుంది. ఇవన్నీ తీరాలి. మనం సుఖంగా సంసారం చేసుకోవాలనుకుంటే, మన పిల్లల్ని వృద్ధిలోకి తీసుకురావాలనుకుంటే, ఈ అచ్చట్లూ, ముచ్చట్లూ, ఈ దురలవాట్లూ మానుకుంటే మంచిది. మనం ఇలాంటి వాటిపట్ల చూపే శ్రద్ధ, పట్టుదల మన పిల్లల భవిష్యత్తుపట్ల చూపుతే మన ధర్మం మనం నిర్వర్తించుకున్నవాళ్ళం అవుతాం. అంతేగాని ఇవాళ ఏభయ్యో అరవయ్యో ఖర్చుచేసి చెల్లాయి పుట్టింరోజు ఘనంగా చేస్తే దానికి ఒరిగే దేమీ లేదు. దానికి నాలుగు అక్షరంముక్కలు అబ్బేట్టు చూసుకుంటే అంతకంటె వాళ్లకు మనం చేసే మహోపకారం మరోకటి లేదు. మనం ముందుగా ఒక విధమైన పొదుపు వుద్యమం సాగిద్దాం. ముందు కాఫీతో అది ప్రారంభిద్దాం తర్వాత క్రమేణా ఇతర దుబారాలు తగ్గించుకుందాం." ఇలా సానునయంగా చెప్పుకొచ్చాను.

ఇందాక నేను వుంగరం తీసి విసిరేసిన సంఘటనకి ఎంత ప్రాధాన్యంవుందో ఇప్పుడు నాకు ఇంకా బోధపడింది ఆ సంఘటన వాళ్లి మనస్సుల్లో కలబర్చిన ప్రభావం చాలా బలమయిందే అయివుండాలి. అందుకనే అనూరాధే కాకుండా అమ్మకూడా ముభావాన్ని వదుల్చుకుని "అవును మానేద్దాంరా" అంది. వాళ్ళ కంఠాలలో ఒక పట్టుదలా, దీక్షా ధ్వనించినట్టుగా నాకనిపించింది. నా మనసు ఎంతో తేరిపిన పడినట్టుగా అనిపించింది. ఆ వుత్సాహంలోనే ఆరాత్రి రెండో ఆట కూడా చూసుకుని అర్ధరాత్రి రెండింటికి వచ్చి తలుపుకొట్టిన తమ్ముడిమీద నాకు ఆగ్రహం కలగలేదు. అమ్మవాడ్ని మందలించటంకూడా విన్నాను. వాడు దురుసుగా సమాధానం చెప్పి వూరుకున్నాడు.

"మీకు నిజంగా ఇందాక కోపం వచ్చింది కదూ" అంది అనూరాధ.

"నువ్వు ఇంకా మేలుకువగానే వున్నావా?

"హుఁ!!"

"కోపం అనేది ఎప్పుడూ నాకు రాదు. ఇదివరకు వచ్చేది. ఇప్పుడు నమిలి మింగే బెంగ, బాధ, అంతే."

"అయినా మీదంతా చాదస్తం. ప్రతి ఇంట్లోనూ వుండే పద్ధతేగా. మనం ఏదైనా ప్రత్యేకంగా చేసేదేముంది? అందరూ కాఫీలు తాగటం లేదూ. అందరి ఇళ్లల్లో అచ్చట్లూ, ముచ్చట్లూ జరగటం లేదూ? మనంకూడా లోకంతోపాటే" అంది అనూరాధ.

"అయితే అందరూ చేస్తున్నారుకాబట్టి అది సవ్యమవుతుందా?"

"కాదులెండి. అవి మానుకోవటం చాలా మంచిదే. మీరు అంతగా బాధపడుతుంటే అలాగన్నాను. మనం కాఫీలు మానేద్దాం" అంది అనూరాధ.

"బజారు సరుకులూ, కూరలూ నేనే తీసుకువస్తాను. రేపట్నుంచీ వాడ్ని పంపకండి సాధారణంగా బేరం ఆడాల్సిన అవసరం లేకుండా మనవాళ్ళు ధరలు చెప్పరు. మనవాడికి బేరమాడటం నామోషీ! తూకంలో తేడాలుంటాయి...ఇంకా... చాలా...చాలా..."

అనూరాధ నవ్వేసింది. "సంసారంలో ప్రతి చిన్న విషయం మీకు కావాలి మీకున్న బాధ్యతలు చాలవూ; ఇంకా ఇంటి పనులుకూడా నెత్తిన వేసుకోటానికి" అంది

"నువ్వు నవ్వుతావు నువ్వు నవ్వుతే నాకు ఇలాంటప్పుడు బాధగా వుంటుంది ఇవన్నీ చిన్న చిన్న విషయాలకింద కనిపిస్తాయి కాని వీటిలో చాలా తోసుకుపోతుంది"

"అవునులెండి. ఇవాళ మరిది దోసకాయలు తెచ్చాడు. నా తలకాయంత కాయలు. ఏసెకి రెండు కాయలు తూగాయి. అవి తరుగుతే రెండూ చెడులయిపోయాయి ఎవరయినా చిన్నకాయలు తెచ్చుకుంటారు గాని అంతంత కాయలు తెచ్చుకుంటారా చెప్పండి. చిన్నకాయలైతే చాలా తూగుతాయి. కొన్ని పోయినా కొన్నయినా మిగుల్తాయి. ఆ పావలా దండుగయిపోయింది. వంకాయలన్నీ ముదురూ, పుచ్చులూను. అరవీశలో సగం కాయలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి ఆసవా శేరూ చాలవుగా. రేపు ఇంకో సవాశేరు తెప్పించి కలిపి వండుతానన్నారు అత్తగారు. అప్పుడే వెళ్ళితీసుకు రమ్మంటే అతడు వెళ్ళనన్నాడు."

"అందుకనే వాడ్ని పంపొద్దు. నేనే తెచ్చుకుంటాను. వాడికి అంతేలే. బాధ్యత నెత్తిమీద పడితేగాని తెలిసిరాదు."

"మీ చెల్లెలు పుట్టింరోజు ఘనంగా జరపాలని అత్తగారు గట్టిపట్టుదలగా వున్నారు ఇంతవరకూ. మీకు కోపం వచ్చిందని ఆవిడ ఆ సంకల్పం విరమించుకున్నారనుకుంటాను. ఇవాళ మధ్యాహ్నం 'మావగారే బతికి వుండి వుంటే ఇలాంటి ముచ్చట్లు చూసుకుని ఎంత సంతోషించేవారు' అంటూ వాపోయారు." అంది అనూరాధ.

"అంటే నీ వుద్దేశ్యం?

నా వుద్దేశ్యాని కేముంది. ఆవిడ బాధపడిందని చెప్పానంతే"

"నువ్వు ఆ విషయం చెప్పే పద్ధతి వుందే అదివాలో మార్పు తీసుకురావాలనే ప్రయత్నంగా కనబడుతూంది"

"నేను మీ కుమ్మల రచయితను కాను. అంత నేర్పుగా మీ పాత్రలు మాట్లాడగలవేమో! నాకు చేతకాదు."


"పాత్రలచేత అనుకూలంగా నేర్పుగా మాట్లాడించగలనేమోగాని మిమ్మల్ని మాత్రం అనుకూలంగా మాట్లాడించలేకపోతున్నాను."

"అంత మరీ హద్దు మీరి పోయామా?"

"ఆ విషయం నాకు తెలుసు ఆ భగవంతుడికి తెలుసు"

"అంత హద్దుమీరే మనిషినే అయితే వాళ్ళా వాళ్ళా పండగలకీ, పబ్బాలకీ పెట్టిన చీరలు కట్టుకునే ఖర్మం పట్టింది. చెప్పా పెట్టకుండా అరువు కొట్టులో. తెచ్చుకోలేనా? కట్టుకోలేనా? మీరుఅంతే

(47-వ పేజీ చూడండి)



# ★ నా సంసారం ★

(23-వ పేజీ తరువాయి)

అర్థం చేసుకున్నా రన్న మాట." అంది అనూరాధ నిష్ఠూరంగా.

"నేనొద్దన్నానా, ఇంట్లో అందరూ చేసే పని అదేగా. వాళ్లతో సంప్రదించాలనే నియమం ఎక్కడుంది? అందరూ పెత్తనం చెలగబెడుతూంటేగా లేనిది నువ్వు ఒక్కతివే నా తక్కువ తిన్నది? నువ్వూ చెలాయించు"

"అంత మరీ హాళ్ళూ పెళ్ళూగా కన్నూ మిన్నూ కాని స్వతంత్రం ఎవరూ వెళ్ళబోసుకోవటంలా."

"ఆ విషయం బటలకొట్టులో రెండొందల అరువూ చెబుతూనే వుంది"

"అవును. దగరడబ్బువుండి చేసుకు నే వాళ్ళకి అరువులెందుకుంటాయి. అది లేనప్పుడు అరువు కనిపిస్తుంది. అందరికీవుండే ఖర్చే"

"ఆ స్తమానూ అందరూ, అందరూ అంటావేమిటే? అందరూ మనకి ప్రమాణం కాదు. వాళ్లంతా మన ఇబ్బందులకి ఆదుకుంటారా? అందరూ చేస్తే అది మంచి అయిపోతుందా? మనంతట మనం ఆలోచించుకోవాలి!"

"మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటాం. ఎంతమాత్రం పొదుపు చెయ్యగలుగుతారో చూద్దాం."

"పొదుపంటే మనం వందలూ వేలూ వెనకాల వేసుకుంటామని కాదు నా వుద్దేశం. ఈ ఖర్చు మరోకవిధంగా సద్వినియోగ పర్చుకుందామని. ఇందాక చెప్పలా. నీ గొలుసు విడిపిద్దామని అనుకుంటున్నాను"

అనూరాధ ఆవులించి పక్కకి వత్తిగిలింది. 'అది జరిగినప్పుడు చూద్దాం' అన్నట్టుగా నిర్లక్ష్యంగా.

నేను అర్థాంతరంగా ఆపేసి కళ్ళు నులుపుకున్నాను.

వుయ్యాలలో పాపాయి 'కార్' మన్నాడు!!

నా వొళ్ళు ఝల్లుమంది!! నేనెందుకో చప్పున సిగ్గుపడిపోయాను.

నాకిప్పుడు ముగ్గురు సంతానం!! పట్టుమని పాతికేళ్ళు లేవు. ఇంకెంతమందో?!

అనూరాధ లేచి పిల వాడిని పొత్తిళ్ళలోకి తీసుకుని పాలివ్వసాగింది.

నేను సంతాననిరోధం నిమిత్తం ఆపరేషను చేయించుకోవాలని మొదటి కుర్రవాడు పుట్టినప్పట్నించీ అనుకుంటున్నాను. ఇప్పుడూ అనుకుంటున్నాను. అది ఆచరణలోకి ఎందుకు రావటంలేదో సమాధానం చెప్పుకుంటే నా నిర్లిప్తతకి నాకే సిగ్గువేసింది.

ఇక నాకు పిల్లలుపుటటానికి వీల్లేదు!

గడియారం మూడుగంటలు కొట్టింది. నేను గోడవైపు వత్తిగిలాను.

* * *

తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. విసుక్కుంటూ లేచాను. మెలకువ సహజంగా రాకుండా బలవంతాన రావటం నా చిరాకుకి కారణం. వీధి తలుపు బార్లా తెరవద్దని ప్రతిరోజూ చెబుతాను. తూర్పు వైపున ఉన్న ఆద్వారంగుండా శీతాకాలపు ప్రొద్దుటి ఎండ చురచురలాడుతూ నామీద పడుతోంది. ఆ వేడికి మెలకువ వచ్చేస్తుంది. నేను నిద్రలేమికి ఎర్రబడిన కళ్లని నులుపుకుంటూ ఇవతలకి వచ్చేసరికి పనిమనిషి నవ్వుతూ "అయితే ఈ పూటనించి నాకు ఒక పని తప్పి దన్న మాట" అంటోంది.

"ఏమిటది?" అన్నాను.

"కాఫీలు మానేసినారుగా బాబూ!"

నేను ఏమీ మాట్లాడకుండా దాగరంత ముఖం చేసుకుని వంట గదివైపు చూశాను. అనూరాధ గర్వంగా నవ్వుతూ పక్కకి తప్పుకుంది. అమ్మ ఇవతలికి వచ్చి "అందుకనే జీతంలో ఈ నెలనించి ఒక అర్ధరూపాయ కోత పెడతాను" అంది.

'ఇది వ్యంగ్యం కాదుగదా' అని నేననుకున్నాను. ఎందుకంటే ఆవిడ ఆమాటలంటూ నావైపు చూసిన చూపునిబట్టి నేనలా అనుకున్నాను. కాని అది నిజం కాదు.

"అదేం కుదరదమ్మోయ్!" అంది మని మనిషి.

"ఊరికే అన్నానే. అంత కంగారుపడతావు దేనికి?" అంటూ అమ్మ మాసినబట్టలు బుజాన వేసుకుని బావి దగ్గరకు వెళ్లింది.

"రోజూ ఆ బట్టలన్నీ తను ఉతక్కపోతే ఒక అర్ధరూపాయ పడేస్తే చాకలి వుతికి పెట్టదూ" అన్నాను అనూరాధ వైపు తిరిగి.

"అనవసరంగా ఎందుకు ఖర్చు అని ఆవిడ అభిప్రాయం" అంది అనూరాధ.

ఇది చాలా అందంగా వుంది! నాకు నవ్వాలో ఏడవాలో తెలియటం లేదు. ఏది అవసరమో అక్కడ లోభిత్వం చూపటం, ఎక్కడ అనవసరమో అక్కడ పెద్ద భారీతనం వెలగబెటటం—ఇదన్నమాట మీ దృష్టిలో జాగ్రత్తంటే."

బావి దగ్గర నీళ్లు పోసుకుంటూ తమ్ముడు అమ్మమీద ఎగురుతున్నాడు. ఆవాళ ఇంట్లో కాఫీ పెట్టనందుకు వాడు కాఫీ హోటలుకి పోయి తాగుతాట్ట. వాడికి ఆఫీసు దగ్గర ఒక అరువు హోటలుంది. నెలకి ఇరవైకి తక్కువ కాకుండా వాడి హోటలు ఖర్చు వుంటుంది. మొదటి తారీకున జీతం రాగానే ఆ డబ్బు అక్కడ కట్టేస్తూంటాడు. ఏ నెలకానెల ఇంత ఖచ్చితంగా డబ్బు చెల్లించే కాతాలు చాలా తక్కువంటూ ఆ హోటలు వాడు వీడ్ని మెచ్చుకుంటూ తరుచు మిగతావాళ్ళ దగ్గర వీడ్ని ఉదాహరణగా చెబుతూంటాట్ట. అని వీడు అమ్మ దగ్గర గర్వంగా చెబుతూంటాడు.

మొత్తంమీద ఈ ఉదయం నా పాతికేళ్ళ జీవితంలోనూ చాలా ప్రధానమైన సమయం. పాతికేళ్లుగా వేళ్ళు తన్నుకుపోయి పెద్ద రాక్షసిలా మా సంసారాన్ని పట్టి పల్లారుస్తున్న ఒక దురలవాటుని రూపుమాపే ఒక వుద్యమం ప్రారంభమయింది. ఇంతకంటె గర్వకారణమైన విషయం ఏముంటుంది? తను మారినట్టుగా అమ్మకూడా రాత్రి ఒక హామీ ఇచ్చింది. ఈ ఇంట్లో అచ్చట్లూ, ముచ్చట్లూ అంటూ దుబారా ఇక జరగటానికి వీల్లేదు. అలా జరగదని నేను గట్టిగా నమ్మాను. ఒక పెద్ద ప్రణాళిక జయప్రదంగా నిర్వహించినంత సంతృప్తి నా హృదయాన్ని ఆవరించుకుంది.

అయితే ఇంట్లో అందరూ ఆ పూట ఎందుకో తడుముకుంటూన్నట్టుగా, పోయిన వస్తువుకోసం వెతుక్కుంటున్నట్టుగా, వుండి వుండి వులికిపడుతున్నట్టుగా మసలటం నేను గమనించాను. ఇన్నాళ్ళ వ్యసనం ఒక్క పూటతో స్వస్తి చెప్పటమంటే సామాన్యమైన విషయం కాదు. అయినా మా వాళ్లు దృఢంగా నిలబడగలిగారు.

నా డైరీలో ఇలా రాసుకున్నాను. "ఈ పూట సూర్యోదయం బాహ్యంగా నే కాదు. మా అందరి మనస్సుల్లోనూ ఈ వెలుగు ఉదయించింది. నా కష్టాన్ని, బాధని, శ్రమని, నా వాళ్ళు ఇన్నాళ్ళకి అర్థం చేసుకుని నా బాధ్యత పంచుకున్నారు. నాకు శాంతిగా వుంది. ఇంతకంటే నేను కోరేదేముంది?" ఇలా రాస్తూంటే నా చేతులు కొద్దిగా వణికినట్టుగా నాకనిపించింది.

* * *

ఆఫీసులో మిత్రులు చాలామంది నన్ను హేళన చేస్తూంటారు. కారణం ఆఫీసు పక్కనే వున్న హోటల్ కాతా పుస్తకంలో నా పేరు లేకపోవటమే. కనీసం ఆ ఛాయలకైన పోవటం ఇష్టంలేని నన్ను ఒక లోభిగా తోటి గుమాస్తాలు భావించుకున్నారో ఏమో "పోనీ నీ హోటలు ఖర్చు మేం భరాయిస్తాం రారాదూ" అంటూ అప్పుడప్పుడు బలవంతం చేస్తూంటారు.

"నాకు అలవాటులేదు భాయీ!"

"పొద్దున్నగా తినివస్తావు. సాయంత్రం దాకా ఎలావుండగలవయ్యా?"

"నాకు ఆకలివేస్తే నేనెందుకు వూరుకుంటాను."

"అది నమ్మతగ్గవిషయం కాదు. ఆకలి ఎందుకువెయ్యదు. అందులో గుమాస్తాది

# 'నా సంసారం'

కూడాను."

"ఇంటికి వెళ్ళగానే తొందరగానే భోజనం చేస్తాను."

వాళ్ళు విసుక్కుంటూ వెళ్ళిపోతారు. దూరంగాపోయి వెనక్కి తిరిగి నన్ను చూసి నవ్వుకుంటారు. కాని నెలమొదట్లో జీతాలు పుచ్చుకునే వేళకి బయట కిటికీలపక్కగా చెటిలో కాతాపుస్తకాలతో నిలబడి తొంగి తొంగిచూసే హోటలువాళ్ళని తప్పించుకుందుకు వీళ్ళుచేసే ప్రయత్నాలు, గత్యం తరంలేక, ఇద్దరికి తప్పక వాళ్ళు సైతాను లాగ పట్టుకున్నప్పుడు వీళ్ళపడేబాధ... అప్పుడేమయిపోతాయి ఈ చిరునవ్వులూ, వ్యంగ్యాలూను!

అప్పుడప్పుడు హోటలువాళ్ళు వసూలు కాని పెంకి కాతాల తాలూకు తగాయిదాలు పరిష్కరించమనుందుకు నన్ను మధ్యవర్తిగా వాడుకోవటంకూడా మాతోటి గుమాస్తాలకి గుర్రుగుర్రుగా వుంటుంది.

సాయంత్రం జీతంపుచ్చుకుని నాలు గింటికి ఆఫీసరుగారిదగ్గ పర్మిషన్ తీసుకుని ఇంటికి బయల్దేరాను. ఇవ్వాళవిందీ ఇంటి బాధ్యతకూడా నేనే నెత్తిన వేసుకోదల్చు కున్నాను. ఇంట్లో బియ్యం నిండు కున్నాయి. వాళ్ళనీ వీళ్ళనీ అప్పులడగటం నాకు సమ్మతంగావుండదు. అందుకనే తొందరగానే వెళ్ళి నెలసరి సరుకులన్నీ తీసుకు రావటంకోసం బయల్దేరాను. బట్టలకొట్టు వాడు రోజూ వచ్చి పీక్కుతింటున్నాడు. ఈ నెల ఒక పిథయ్యయినా చెల్లువేస్తేగాని వాడు శాంతించడు. అలా వెళ్ళాను! డబ్బు చెల్లు వెట్టి రాబోతుంటే పిడుగులాంటి సంగతి నా చెవిని వేశాడు వాడు. అమ్మ స్వయంగా వచ్చి ఒక పరికిణీగుడ్డా, జాకెటు గుడ్డా, ఇంకా ఏవో రవికల గుడ్డలూ-అంతా కలిసి ఇరవై రూపాయల బట్టలు పట్టుకెళ్ళిం దంటూ బిల్లుచూపించాడు. అక్కడ నేనేం మాట్లాడతాను. నా ముఖంచూసి జరిగిం దంతా వాడు వూహించాడు కాబోలు "మీ చెల్లెలుగారి పుట్టినరోజట కదండిసార్! ఏదో ఎంతకలిగితే అంత! వున్నదాంట్లో వున్నంతగా అనుభవించాలి సార్! ఒక్కమా రయినా మమ్మల్ని భోజనానికి పిలవ లేం సార్!" అంటూ తనలో తాను నవ్వుకో సాగాడు.

నేను నవ్వునటించి ఇవతలికి వచ్చేశాను. నా మనస్సంతా కుతకుత లాడిపోతూంది. రాత్రి అమ్మచెప్పిన మాటలు నమ్మాను. కాని ఇలా నిలకడలేని మనుష్యులని నేననుకోలేదు. తలనొప్పిగా తోచి తలపట్టుకుని నడవసాగాను. షరాబు కొట్టుకు ఇంకో గంటలో వస్తానని చెప్పటానికి అతనికొట్టుకు వెళ్ళాను.

"అమ్మగారు సరుకులన్నీ పట్టుకెళ్ళా రండీ!" అన్నాడు సాహుకారు.

"ఎంతయింది?"

"నలభై!"

నేను ఇక అక్కడ నిలబడ దల్చుకోలేదు నలభై! ప్రతినెలా పాతికరూపాయలకంటె మించదు. ఈ నెల ఇంకా పదిహేను! ఇదంతా ఒక్కరోజు ముచ్చటలో కరిగి పోతుంది. మరునాడు మళ్ళీ సంచీ బుజాన వేసుకుని కొట్టుకుపోక తప్పదు. తలనొప్పి బాగా ఎక్కువైంది.

ఇంటిగుమ్మంలో అత్తరుసాహెబు ముఖానికి చెయ్యి అడ్డంపెట్టుకుని లోపలికి గుచ్చిగుచ్చి చూస్తున్నాడు.

"ఎవరికోసం?" అన్నాను.

"అమ్మగారు డబ్బు ఇవ్వాలి. సెంటు పుచ్చుకున్నారు"- కుర్రవాడువచ్చి డబ్బు లిచ్చాను. అతను వెళ్ళిపోయాడు.

నేను గుమ్మంలో అడుగు పెటగానే నాకు మొట్టమొదట కనిపించిన దృశ్యం అమ్మ మూతి తుడుచుకుంటూ కాఫీగిన్నెలు కైట పడెయ్యటం.

కాఫీకుంపటిచుట్టూతా పిల్లలు తగవు లాడుకుని ఒలకబోసిన కాఫీ మరకలు!— కొద్దిదూరంలో అనూరాధ కాళ్ళమీద ఎడ పిల్లవాడ్ని వేసుకుని "అబ్బ! పాడుపిల్లాడు! దంటికుంక వాడు తాగకుండా మనం తాగటమేమిటని ఒక చుక్క పడదామంటే గుటక మింగుతేనా" అని విసుక్కుంటూ వాడినోరు వగలదీసి నోటికి ఒకచెంచా అడ్డం పెడుతూ కాఫీగొంతుకలోపోసి బలవంతాన తాగిస్తూంది. రెండుతరాలవ్యసనం మూడో తరాన్నికూడా బానిస చేస్తూంది.

వాళ్ళు చెప్పిన సంజాయిషీలు నేను ఇక్కడ రాయదల్చుకోలేదు. అనూరాధ ముస్తాబు చేసుకుని మరదలి పుట్టింరోజుకి బంధుబలగాన్ని భోజనానికి పిలవటానికి వెళ్ళే సన్నాహంలో, అమ్మ మరునాటి అతంగానికి చేసుకునే ఏర్పాట్లలో వాళ్ళని నిలదీసి, రొక్కించి మాటకిమాట పెంచుకునే ధైర్యమూ నాకు లేకపోయింది.

రాత్రి జేబులో డైరతీసి ఆ పేజీ వెదుక్కుని ఉదయంరాసిన నాలుగు పంక్తులూ అడ్డంగా కొటివేస్తున్నప్పుడు నా చెయ్యి కొద్దిగా వణికింది. ఇంకా ఏవో రాయాలని మనసులో వుంది. కాని డైరీలో ఆ తారీకు కాగితంలో ఇక చోటులేదు. ★

పెరీరావారి

షీమార్

కుటుంబానికంతా ఉపయోగ పడు దగ్గు నివారిణి

దగ్గులు, జలుబులు మరియు బ్రాంకైటిస్ బాధలకు నమ్మకమైన నివారిణి

పై జబ్బులకే గాకుండా గొంతు, ఊపిరితిత్తులు, రొమ్ము జబ్బులకు అమోఘమైన వైద్యుల గట్టి నమ్మకవు వలనా ఈ దివ్యౌషధమే.

TRADE Shemar MARK

విల్‌ఫ్రెడ్ పెరీరా
ప్రైవేట్ లిమిటెడ్
ఔషధాల తయారీదారులు
మద్రాసు-7

భారత దేశమంతటా స్టాకిస్టులు కలరు

WPZ-4 TG

## వనితావాణి

(41-వ పేజీ తరువాయి)

తనపరువూ, మర్యాదా, మంటకలిసి పోయాయనీ దెబ్బలాడటం మొదలెట్టింది. వేరొక పిల్లతల్లి మాఇంటికి వచ్చి, మా అత్తగారితో "ఏమమ్మా మీ కూతుళ్లూ, కోడలూ ఎంత చదువుకున్న వారైనా, ఇలా మమ్మల్ని పత్రికల్లో పెట్టి రచ్చకీడ్చడం బాగుందా? చెప్పండి? మీరు చదువుకున్న వారైతే మీ చదువులు మీ దగ్గరే ఉంచుకోండి. అంతే కాని, మా సంగతులు మా సంబంధాలు మీ కెందుకు?" అని ఏమేమో అనడం మొదలెట్టింది. ఇదంతా మా అత్తగారికి తెలియక మమ్మల్ని కేక వేయడం మొదలెట్టారు. దానికి మాకు ఏడ్వాలో, నవ్వాలోకూడ తెలియలా అప్పట్లో. అది ఎవ్వరికి వ్యక్తిగతంగా సంబంధించినది కాదని, అందులో లోకపు సహజగుణాన్ని విమర్శించామనీ వాళ్ళకి నచ్చచెప్పేసరికి మాకు తలప్రాణం తోకకు వచ్చిందంటే నమ్మండి! ★

—ఎస్. సుమిత్రాదేవి, బిలాస్‌పూర్, మధ్యప్రదేశ్]